క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంఈఓగా శ్రీనివాస్‌రెడ్డి



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిగా ఎ.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శ్రీనివాస్‌రెడ్డి భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహించిన రాజిరెడ్డి పదవీ విరమణ పొందాడు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డిని ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది బుధవారం కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిట్ పీఆర్వోగా కార్తీక్ బాల సుబ్రహ్మణ్యన్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ నూతన పీఆర్వోగా మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ కార్తీక్ సుబ్రహ్మణ్యన్‌ను నియమిస్తూ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పీఆర్వోగా విధులు నిర్వర్తించిన రాహుల్ రెండేళ్ల కాలం పూర్తి కాగా, నూతన పీఆర్వోగా కార్తీక్‌ను నియమించినట్లు తెలిపారు.

టై, బెల్ట్‌లు, డ్రెస్‌ల పంపిణీ



కాజీపేట అర్బన్: విద్యార్థులకు తన సొంత ఖర్చుతో టై, బెల్ట్‌లు, స్పోర్ట్స్ డ్రెస్‌లను కడిపికొండ గ్రామం ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం కొండ్ర మంజుల బుధవారం అందజేశారు. ఈమేరకు హెచ్ఎంను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లత, ఉపాధ్యాయులు చుంచుకాల లింగారావు, జమీలా బేగం, సుభద్ర, గ్రామ పెద్ద బస్కే దశరథం అభినందించారు.

పీఏసీఎస్‌లో సభ్యత్వాలకు అవకాశం

న్యూశాయంపేట: వరంగల్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సభ్యత్వం లేని అర్హతగల రైతులకు నూతనంగా సభ్యత్వం కల్పిస్తున్నట్లు సంఘం చైర్మన్ ఇట్యాల హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సభ్యత్వం కావాలనుకున్న వారు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సంఘ కార్యాలయంలో ఈనెల 31లోపు సమర్పించాలని పేర్కొన్నారు. రుణమాఫీ వర్తించిన సభ్యులు తమ పేరుపై ఉన్న వడ్డీ బకాయిలను త్వరగా చెల్లించాలని కోరారు. రుణమాఫీ వర్తించని సభ్యులు మొత్తం బకాయిలు చెల్లించి తిరిగి రుణం పొందాలని, లేకుంటే వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని హరికృష్ణ సూచించారు.

మెడికల్ సీట్ల కుంభకోణంపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఎంజీఎం: కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో మెడికల్ సీట్ల కుంభకోణంపై లోకాయుక్త విచారణ సంస్థలో వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ దాఖలుచేసిన ఫిర్యాదును విచారణకు స్వీకరించినట్లు వినియోగదారుల మండలి సభ్యులు తెలిపారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు చేయాలనే లోపాయికారి ఒప్పందంతో నష్టపోయిన అర్హులైన 400 మంది మెడికల్ విద్యార్థులకు న్యాయం జరగాలని, అవినీతి అధికారులపై విచారణ చేపట్టాలని లోకాయుక్త సంస్థలో వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వినియోగదారుల మండలికి లోకాయుక్త కార్యాలయం నుంచి సమాచారం అందించినట్లు వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు.

రైల్వే అధికారులకు సన్మానం



కాజీపేట రూరల్: ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణకు స్వాగతం పలుకుతూ, బదిలీపై వెళ్తున్న సీనియర్ డీఈఈ ప్రశాంత్‌కృష్ణసాయికి కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ ఎంప్లాయీస్ సంఘ నాయకులు వీడ్కోలు పలికారు. ఈ మేరకు ఇరువురిని బుధవారం ఘనంగా సన్మానించారు. రైల్వే సంఘ నాయకులు వెంకటనారాయణ, బల్విందర్ సింగ్, బి.మాధవరావు, సాంబమూర్తి, శారద, విజయ్‌కుమార్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్‌కు నాయకుడే లేడు’

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎస్సీ నాయకుడే లేడని, గతిలేక మాజీ మంత్రి దయాకర్‌రావుకు బాధ్యతలు అప్పగించారని ఎస్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చిత్తడిగా మారిన నగర రోడ్లు

చిన్నపాటి వర్షానికే నగరంలోని రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. మంగళవారం కురిసిన వర్షానికి రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వరద నీరు చేరడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మట్టిరోడ్లు బురదయమంగా మారాయి. లోతట్టు ప్రాంతాల వారు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ



హనుమకొండ పరిమల కాలనీ నుంచి జవహర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా గుంతలు



విద్యుత్‌నగర్ తెలంగాణ సెంటర్ నుంచి న్యూశాయంపేటకు వెళ్లే రోడ్డులో భారీ గుంతలు



హనుమకొండ లష్కర్‌బజార్‌లోని మర్కజీ హైస్కూల్ ఎదుట ఏర్పడిన గుంత



హనుమకొండ ఇందిరమ్మ కాలనీలో బురదమయమైన రోడ్డు



కాకతీయ యూనివర్సిటీ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే రోడ్డులో గౌతమ్‌నగర్ కాలనీ ఆర్చ్ ఎదుట..

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



హన్మకొండ కల్చరల్: ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ ఎదుట తనిఖీలు చేస్తున్న పోలీసులు

హన్మకొండ కల్చరల్: సైబర్ క్రైంల ద్వారా జరిగే మోసాలపై తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఓటీపీ ఆధారిత మోసాలు, నకిలీ ఉద్యోగ యాప్‌లు, నకిలీ లోన్ యాప్‌లు, నకిలీ కస్టమర్ కేర్ మోసం, నకిలీ రైల్వే, బస్సు టికెట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, మ్యాట్రిమోనియల్ సైట్ మోసాలు, బ్యాంక్ రివార్డ్స్, ఏపీకే ఫైల్ మోసాలపై ప్రయాణికులకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, సుదర్శన్, సీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ అండ్ నార్కొటిక్ బృందం పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాళ్లు, స్టేషన్ బయట అనుమానాస్పద వ్యక్తులు, లగేజీలను తనిఖీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం డ్రగ్స్ రహిత సమాజంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అండ్ నార్కొటిక్ ఇన్‌చార్జ్ సీఐ సతీష్, ఎస్సై మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం

హన్మకొండ: హనుమకొండ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను ప్రణాళిక శాఖ విడుదల చేసింది. జిల్లాలో సగటున 20.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కాజీపేటలో 44.2 మిల్లీ మీటర్లు, ధర్మసాగర్‌లో 43.5, హనుమకొండ 33.1, ఐనవోలులో 37.6, భీమదేవరపల్లిలో 28.3, వేలేరులో 34.2, కమలాపూర్‌లో 3.1, హసన్‌పర్తిలో 14.4, పరకాలలో 5.5, దామెరలో 8.1, ఆత్మకూర్‌లో 8.2, శాయంపేటలో 4.2, నడికుడలో 4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

ఏసీపీ ఆకస్మిక తనిఖీలు



కాజీపేట చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న ఏసీపీ

కాజీపేట: కాజీపేట పట్టణంలో ఉన్న ప్రధాన చౌరస్తాలను ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. కాజీపేట చౌరస్తాతో పాటు సోమిడి రోడ్డు, రైల్వే జంక్షన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్‌కు ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. జంక్షన్లలో పోలీసు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు సాగకుండా చూడాలని, రహదారులపై ఆకతాయిల ఆటలు కట్టించాలని సూచించారు. తనిఖీల్లో సీఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, ఎస్సై లవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

● పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు

హసన్‌పర్తి: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ చేరాలు

అనంతరం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రఫుల్లా దేవి, అధ్యాకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట: గొర్రెలు, మేకల పెంపకందారుల జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట ట్రిబుల్ ఎస్ కాంప్లెక్స్ ఆవరణలో వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కాజీపేట ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరగనున్న సభకు గొల్ల కురుమలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య, కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, ఎం.రాజు, గిరబోయిన రాజయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల 72 గంటల బంద్‌కు పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం నుంచి బంద్ ప్రారంభం కాగా, పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు కాకతీయ యూనివర్సిటీ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పింగిళి కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హంటర్‌రోడ్డులోని వివిధ డిగ్రీ కళాశాలల వద్దకు చేరుకొని బంద్ పాటించాలని కోరారు. అనంతరం, అశోక జంక్షన్‌లో ధర్నా చేపట్టారు. మరోరెండు రోజులపాటు కళాశాలల బంద్ కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మర్రి మహేష్, బాధ్యులు ప్రకాశ్, రాజేష్, అనిల్, వివిధ కళాశాలల పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి విద్యాసంస్థల బంద్

విద్యారణ్యపురి: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3, 4వ తేదీల్లో 48 గంటలపాటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య తెలిపారు. ఈ మేరకు హనుమకొండలోని పలు విద్యాసంస్థలు, కళాశాలల వద్దకు బుధవారం వెళ్లి బంద్‌కు సహకరించాలని ఆయా యజమాన్యాలను కోరినట్లు సారయ్య పేర్కొన్నారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎడ్యుకేషన్ విభాగంలో పరిశోధకుడు పత్తిపాటి వెంకటేశ్వర్లుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ ది అవేర్‌నెస్ అండ్ చాలెంజెస్ ఇన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఆర్‌టీఈ – 2009 యాక్ట్ అమాంగ్ ది టీచర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కేయూ ఎడ్యుకేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో వెంకటేశ్వర్లు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

మానసిక ప్రశాంతత అవసరం

హన్మకొండ కల్చరల్: వృద్ధులు ఆరోగ్యంగా ఉండాలంటే మందుల వాడకంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అవసరమని అజరా ఆస్పత్రి జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ బండారు సత్యకిరణ్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సౌజన్యంతో రంగశాయిపేటలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఫార్మడీ హెచ్ఓడీ డాక్టర్ బీఎస్.శరవణభవ, డాక్టర్ పి.గిరిజ అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 60మంది వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు బియ్యం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు ఎలగందుల రాజేంద్రప్రసాద్, ఎలగందుల శ్రీనివాస్, వైద్యులు వెంకటేశ్వర్లు, మకర్ద్, సఫియానసీర్, లావణ్య, స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పరికిపండ్ల వేణు

నయీంనగర్: 53వ డివిజన్ ఆదర్శకాలనీకి చెందిన పరికిపండ్ల వేణు.. థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న కృష్ణమూర్తి

హసన్‌పర్తి: పింఛన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధ దంపతులకు హసన్‌పర్తికి చెందిన ఓ వ్యక్తి చేయూనందించాడు. హసన్‌పర్తికి చెందిన వేల్పుల రాములుకు వచ్చే ఆసరా పింఛన్‌ను అధికారులు గతేడాది నిలిపేశారు. దాంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాములు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కందుకూరి కృష్ణమూర్తి బుధవారం రూ.20 వేలు అందించాడు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, స్థానికులు కర్ణాకర్‌రెడ్డి, వేల్పుల సంపత్, దాడి రాజు, అట్ల కర్ణాకర్, కొమ్ము అంజి, మారం కుమార్, రమేష్, దాడి రణధీర్, తోట చిన్న సారంగపాణి, మల్లయ్య, కుమారస్వామి, శ్రీనినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలి

● ఆర్టీసీ వరంగల్ –2 డిపో మేనేజర్ వెల్దండి జ్యోత్స్న

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీని పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వరంగల్ –2 డిపో మేనేజర్ వెల్దండి జ్యోత్స్న సూచించారు. ఈనెల 5న వారాంతపు సెలవు శనివారం రోజు రామప్ప, మల్లూరు, బొగత పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతోందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు ఉదయం 5 గంటలకు బయలుదేరి రామప్ప, మల్లూరు, బొగత సందర్శనానంతరం అదే రోజు రాత్రి 9 గంటలకు బస్‌స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. చార్జీలు పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.350గా నిర్ణయించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ముందస్తు రిజర్వేషన్, వివరాల కోసం 98668 32734 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బస్సుల హాల్టింగ్ కోసం రోడ్డెక్కిన ప్రజలు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: పరకాల – హనుమకొండ ప్రధాన రహదారిలోని ఆరెపల్లి జంక్షన్ వద్ద స్థానికులు బుధవారం ఆందోళన చేశారు. ఆరెపల్లి సెంటర్‌లో ఆర్టీసీ బస్సుల హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ రాస్తారోకో చేశారు. ఈ మేరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఏడాదిగా ఆరెపల్లి సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రోడ్డు విస్తరణ సందర్భంగా ఇక్కడ ఉన్న బస్‌షెల్టర్‌ను తొలగించారని గుర్తుచేశారు. అనంతరం, ఆర్ఎం కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



ప్రచారం నిర్వహిస్తున్న హైదర్, తదితరులు

● హనుమకొండ డీఎండబ్ల్యూఓ గౌస్ హైదర్

న్యూశాయంపేట: నాణ్యమైన విద్యనందిస్తున్న మైనార్టీ గురుకులాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి (డీఎండబ్ల్యూఓ) కేఏ.గౌస్ హైదర్ సూచించారు. గురుకులాల్లో చేర్పించాలని కోరుతూ హనుమకొండ నగరంలోని న్యూరాయపురాలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని తెలిపారు. మైనార్టీ గురుకులాలు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో పనిచేస్తున్నాయని వివరించారు. అనంతరం, ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న మైనార్టీ గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎల్‌సీ శ్రీనివాస్, హనుమకొండ (బీ1) ప్రిన్సిపాల్ డాక్టర్ జే.సతీష్, డాక్టర్ అనీస్ సిద్దిఖీ, సయ్యద్ అక్బర్, మహ్మద్ నయీం తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు రుణమాఫీపై హర్షం

రామన్నపేట: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు రుణమాఫీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు కొనియాడారు. ఈ మేరకు కొత్తవాడలోని చేనేత కార్మికులతో కలిసి బుధవారం సంబురాలు చేసుకున్నారు. చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభోత్సవం సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం 2017, ఏప్రిల్ 1నుంచి 2024, ఆగస్టు 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రూ.లక్ష లోపు వ్యక్తిగత రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేసి చేనేత కుటుంబాలను ఆదుకున్నారని వివరించారు. కార్యక్రమంలో నంబి మురళి, ఈగ శ్రీధర్, కట్ల స్వామి, ఆడెపు చంద్రమౌళి, గుర్రం రాజమౌళి, ఆనందం వెంకటయ్య, గోంగూర నారాయణ, నాసం లావణ్య, వంగ రేఖ తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న చేనేత కార్మికులు

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం



హసన్‌పర్తి: రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



వీరన్న దంపతులను సన్మానిస్తున్న చైర్మన్, ఏఓలు

హసన్‌పర్తి: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన రాజిరెడ్డిని నగరంలోని ఎంటీఆర్ గార్డెన్‌లో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తర్వాత శేష జీవితాన్ని సమాజ సేవకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యవర్గ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సేవలు గొప్పవి

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బాలనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 33 ఏళ్లు నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వీరన్న సేవలు గొప్పవని ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచారి కొనియాడారు. ఆలయ ఆవరణలో వీరన్న దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు.

సంక్షిప్తంగా

అనధికార లేఅవుట్ తొలగింపు

వరంగల్ అర్బన్: బల్దియా పరిధిలోని తిమ్మాపూర్ శివారు ప్రాంతం సర్వే నంబర్ 125లో అనధికారికంగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను బుధవారం తొలగించినట్లు బల్దియా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు తిమ్మాపూర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ నిర్మాణాలను నేలమట్టం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో టీపీఎస్‌లు అనిల్, అవినాష్, టీపీబీఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

కాజీపేట అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకట రమణగౌడ్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేష్, సట్ల సదానందం పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం సాయం

హన్మకొండ: పేదలు పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ సుబేదారి అలీపురలో పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఆమె సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

కేయూ క్యాంపస్: కేయూ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం శ్రమదానం చేశారు. మొదటి గేట్ నుంచి రెండో గేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఆడిటోరియం సమీపంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, వాగ్దేవి కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కుమార్, శైలజ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డాక్టర్ విశ్వనాథరావు ఆస్పత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ప్రారంభించారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో డాక్టర్ సుస్మిత పర్యవేక్షణలో 16 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం ఉందని గుర్తించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు క్షీరసాగర నరేష్, రాజుచారి, కోశాధికారి సాల్మన్, విజయ్‌కుమార్, గాజుల రఘు, కమటం శ్రీనివాస్, బైరి సారంగబాబు, డాక్టర్ ఆర్య, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట – వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య దర్గా రైల్వేగేట్‌కు కూతవేటు దూరంలో ఇందిరమ్మ కాలనీ సమీపంలో గుర్తు తెలియని ఓ యువకుడు రైలుకింద పడి బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్పీ పోలీసులు తెలిపారు. వివరాలకు 97017 47014 నంబర్‌లో సంప్రదించాలని సుదర్శన్ సూచించారు.